జాతీయ అవార్డు కోసం దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, జూలై 3: ఉపాధ్యాయులను జాతీయ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసేందుకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు ఈ నెల 15వ తేదీ వరకు http://nationalaward-stoteachers.education.gov.in) వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రింట్ కాపీ, సంబంధిత ప్రతులను జతచేసి 3సెట్లను డీఈవో కార్యాలయంలో అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు కోరారు.



డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

డాక్టర్లు అందుబాటులో ఉండాలి

» కలెక్టర్ శశాంక » శంషాబాద్ పీహెచ్‌సీ తనిఖీ

రంగారెడ్డి అర్బన్, జూలై 3 : డాక్టర్లు అందుబాటులో ఉండి.. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ శశాంక వైద్యులకు సూచించారు. బుధవారం ఆయన శంషాబాద్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సిబ్బందితో పాటు రోగులకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది విధులకు సరైన సమయానికి హాజరు కావాలని, ఆసుపత్రికి వచ్చే రోగులను కసురుకోకుండా వైద్యం అందించాలన్నారు. రోగులకు అవసరమైన చికిత్స అందించి మందులు అందజేయాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి వాటి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ శశాంక సూచించారు. ఆకస్మిక తనిఖీలో శంషాబాద్ తహశీల్దార్ నాగమణి, డాక్టర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలను ఇంటికి పంపే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కవిత

రంగారెడ్డి అర్బన్, జూలై 3 : అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు అతి తక్కువ డబ్బులు చెల్లించి జూలై 24 తర్వాత ఇంటికి పంపించే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కవిత అన్నారు. ఈ మేరకు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 65 సంవత్సరాలు పూర్తయిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సుమారు 10వేల మంది ఉన్నారని చెప్పారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని 2023 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 4 వరకు రాష్ట్రంలో 24 రోజుల పాటు నిరవధిక సమ్మె చేశామన్నారు. ఈ సమ్మెలో గత ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్స్‌కు రూ. 2 లక్షలు, హెల్పర్స్‌కు రూ. లక్ష పెంచుతామని, పెన్షన్, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఈ ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకు వెళ్లామని చెప్పారు. ప్రభుత్వం వాటిని పరిష్కరించక పోగా రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల మనోభావాలకు వ్యతిరేకంగా ఏకపక్షంగా అతి తక్కువ డబ్బులు చెల్లించి అంగన్‌వాడీ టీచర్లను, హెల్పర్లను జూలై 24 తర్వాత ఇంటికి పంపించాలని నిర్ణయించడం అత్యంత దుర్మార్గమని ఆమె పేర్కొన్నారు.

పరిషత్‌లలో ప్రత్యేక పాలనేనా!

» ఈ నెల 3వ తేదీతో ముగిసిన మండల పరిషత్‌ల పదవీ కాలం
» నేటితో ముగియనున్న జిల్లా పరిషత్‌ల పాలన
» ఇప్పటికే పంచాయతీల్లో ప్రత్యేకాధికారులకు అధికారం
» స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణపై స్పష్టత కరువు
» కులగణన తర్వాతే చేపట్టాలని పలువురి డిమాండ్

మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో కూడా ప్రత్యేకాధికారుల పాలనే రానుందా అంటే అవుననే సమాధానమే వస్తోంది. మండల పరిషత్‌ల పదవీకాలం బుధవారం, జిల్లా పరిషత్‌ల పదవీకాలం నేటితో ముగియనుంది. అయితే, వీటికి ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగడం తప్పనిసరి అన్న భావన వ్యక్తమవుతోంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనా వెలువడక పోవడంతో సర్పంచ్‌ల తరహాలోనే ప్రత్యేకాధికారుల పాలన అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నట్లు చర్చ సాగుతోంది.



జడ్పీకి అరకొర నిధుల కేటాయింపు



జిల్లా పరిషత్‌కు ఐదేళ్లలో మొత్తంగా రూ.83 కోట్లు మాత్రమే ప్రభుత్వం కేటాయించింది. అరకొర నిధులతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేకపోయాము. ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, సీనరేజ్ గ్రాంట్ కేటాయించలేదు. ఐదేళ్ల కాలంలో రెండేళ్లు కరోనా మహమ్మారి రాష్ట్రాన్ని, జిల్లాను అతలాకుతలం చేసింది. మిగిలిన మూడేళ్ల కాలంలోనూ నిధుల కేటాయింపు జరగక పోవడం అభివృద్ధికి అడ్డంకిగా మారింది. ఏది ఏమైనా గడిచిన ఐదేళ్ల కాలం మంచి అనుభూతినిచ్చింది. జడ్పీ సభ్యులు, అధికారులు, అందరి సహకారంతో ఉన్న నిధులతోనే అభివృద్ధి కోసం కృషి చేశాం.

- అనితాహరినాథ్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్ : మండల పరిషత్ పదవీ కాలం ఈ నెల 3వ తేదీతో ముగిసింది. నేటితో జిల్లా పరిషత్ పదవీ కాలం ముగియనుంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించడం అసాధ్యం. ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర సర్కార్ ఇప్పటికి వరకు ఎలాంటి నిర్ణయమూ ప్రకటించలేదు. ఒకవేళ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించినా ఎన్నికల నిర్వహణకు సమయం పట్టే అవకాశముంది. దీంతో గ్రామ పంచాయతీల మాదిరిగానే మండల, జిల్లా ప్రజాపరిషత్‌ల్లోనూ ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి ఇంకా దీనిపై ఎలాంటి ప్రకటన రానప్పటికీ ప్రత్యేకం అనివార్యం కానుందనే ఉద్దేశంతో అధికారులు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 21 మండల పరిషత్‌లు, 257 ఎంపీటీసీ స్థానాలున్నాయి. జిల్లాలో మొత్తం 21మంది ఎంపీపీలు, 21మంది జడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. ఇందులో ఎంపీటీసీ, ఎంపీపీ పదవీ కాలం జూలై 3వ తేదీతో ముగిసింది. ఇక జిల్లా పరిషత్ సభ్యుల పదవీ కాలం నేటితో ముగియనుంది. వీటికి ఇప్పట్లో ఎన్నికలు జరిగేలా కన్పించడం లేదు. 2019లో ఎంపీటీసీ, జడ్పీటీసీల పాలక వర్గాల నిర్ణీత గడువు కంటే రెండు నెలలు ముందుగానే అప్పటి ప్రభుత్వం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించింది. కానీ.. రాష్ట్రంలో అధికారం చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వీటి నిర్వహణకు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనా వెలువడక పోవడంతో సర్పంచ్‌ల తరహాలోనే ప్రత్యేకాధికారుల పాలన అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

రిజర్వేషన్లపై ఉత్కంఠ..

ప్రభుత్వం ఇప్పటికిప్పుడు ఎన్నికలకు సిద్ధమైనప్పటికీ ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యే అవకాశం ఉండదు. రిజర్వేషన్లు, ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. వీటికే రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. కనుక ఇప్పట్లో ఎన్నికలు లేనట్లుగానే కనిపిస్తోంది. ఎన్నికల మాట అటుంచితే పోటీకి తహతహలాడుతున్న అభ్యర్థులను రిజర్వేషన్ల అంశం ఆందోళనకు గురిచేస్తోంది. పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు పదేళ్లపాటు ఒకే రిజర్వేషన్ కొనసాగేలా చట్టం చేసింది. దాని ప్రకారంగానే 2019 ఎన్నికలు నిర్వహించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం గత సర్కార్ ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తుందా? లేక చట్ట సవరణతో కొత్త రిజర్వేషన్లను ప్రకటిస్తుందా? అనే దానిపై అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బీసీల కుల గణనకు ప్రభుత్వం మొగ్గు చూపుతుండటంతో రిజర్వేషన్ల సవరణ అనివార్యమనే భావన కూడా రాజకీయ పార్టీల్లో వ్యక్తమవుతోంది. దీనిపై ఏదైనా ప్రకటన చేస్తే తప్ప స్పష్టత వచ్చే అవకాశం కన్పించడం లేదు. ప్రత్యేకాధికారుల పాలన అనివార్యం కానుండటంతో ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలూ రానప్పటికీ జిల్లా యంత్రాంగం ఆ దిశగా ముందుగానే కసరత్తు ప్రారంభించింది. జిల్లా పరిషత్‌కు కలెక్టర్ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక మండల పరిషత్‌లకు జిల్లాస్థాయి అధికారులు, లేదా జిల్లా అదనపు కలెక్టర్లు ప్రత్యేకాధికారులుగా ఉండే అవకాశాలున్నాయి

ఐదేళ్లలో అభివృద్ధి పనులకు రూ. 83 కోట్లు..

జడ్పీ పాలక వర్గం కొలువు దీరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఐదేళ్లలో రూ.83 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు కేటాయించారు. రూ.10 కోట్లు మహిళా శిశు సంక్షేమానికి, రూ. 15కోట్లు దళితవాడల అభివృద్ధి కోసం కేటాయించారు. అలాగే మరో రూ.10 కోట్లు గిరిజన గ్రామాల అభివృద్ధికి కేటాయించారు.



జడ్పీ పాలక వర్గ సభ్యులు

దొంగల కంట్లో కారం కొట్టి..

చోరులను ఎదుర్కొన్న కుటుంబం

» రంగారెడ్డి జిల్లా కుర్మిద్దలో దొంగల హల్‌చల్
» అర్ధరాత్రి ఇంట్లో చోరీకి యత్నం.. కళ్లల్లో కారం చల్లి పారిపోయేలా చేసిన తల్లీకుమారుడు
» రెండు గంటలపాటు భయపెట్టి తోకముడిచి వెనుదిరిగిన దొంగలు

యాచారం, జూలై 3 : ఆ దొంగలు ఓ ఇంట్లో చోరీకి పథకం వేశారు. అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి విలువైన వస్తువులు, డబ్బు అపహరించేందుకు సిద్ధమయ్యారు. కానీ, వారి ప్రయత్నానికి కుటుంబ సభ్యులు అడ్డుకట్ట వేశారు. ఏమాత్రం భయపడకుండా వారిని ఎదుర్కొన్నారు. రాత్రివేళ తలుపులు తీయాలని భయభ్రాంతులకు గురిచేసినా భయపడకుండా ఎదురుదాడికి దిగారు. దొంగల కళ్లల్లో కారం చల్లి అక్కడి నుంచి పారిపోయేలా చేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్‌స్టేషన్ పరిధి యాచారం మండలం కుర్మిద్దలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో కుర్మిద్ద గ్రామంలో ఆనెమోని రోశయ్య ఇంట్లో ఇద్దరు దొంగలు చోరీకి యత్నించారు. అయితే, కుటుంబ పెద్ద రోశయ్య ఆ సమయంలో ఇంట్లో లేరు. అతడి భార్య లక్ష్మమ్మ, 9 వ తరగతి చదివే కుమారుడు మాత్రమే ఉన్నారు. కాగా, ఇంటి తలుపులు కొట్టి తెరిపించేందుకు దొంగలు యత్నించగా.. అనుమానం వచ్చిన తల్లీకుమారుడు మొదట భయభ్రాంతులకు గురయ్యారు. కానీ, వారు ధైర్యం తెచ్చుకొని తలుపులు తీయకుండా అలాగే ఉండిపోయారు. అయితే, వారి వద్ద పోలీసులకు సమాచారం ఇద్దామన్నా సెల్‌ఫోన్ లేదు. అదేవిధంగా వారి ఇల్లు కూడా ఊరికి దూరంగా ఉంది. ఈక్రమంలో దొంగలు దాదాపు రెండు గంటలపాటు తలుపులు తీయాలని వారిని భయపెట్టారు. చివరకు కిటికీ నుంచి ఇంట్లోకి సెల్‌ఫోన్ లైట్ ఆన్‌చేసి తల్లీకుమారుడిని భయపెట్టేందుకు యత్నించారు. ఇదే అదనుగా భావించిన లక్ష్మమ్మ, అతడి కుమారుడు దొంగల కళ్లల్లో కారం చల్లారు. దాంతో చేసేదేమీలేక వారు అక్కడి నుంచి పారిపోయారు. కాగా, వారు ముఖాలు కనిపించకుండా గుడ్డలు కట్టుకొని ఉన్నారని, తలుపులు తీయాలని బెదిరించినా భయపడలేదని బాధితులు తెలిపారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విచారణ చేపట్టారు. క్రైంపార్టీ పోలీసులు మీర్‌ఖాన్‌పేటలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కాగా, పది రోజుల క్రితం ఇదే గ్రామంలో మంగలి జంగయ్య ఇంట్లో దుండగులు దొంగతనం చేయడానికి విఫలయత్నం చేశారు. అప్పట్లో పోలీసుల నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. దొంగలు తమ గ్రామానికి చెందినవారే అయ్యుంటారని పలువురు అనుమానం వ్యక్తం చేశారు.

పల్లెల్లో 'మీసేవ'లు

కొత్తగా 82 కేంద్రాలు మంజూరు

» 'మహిళా శక్తి' పేరుతో అతివలకే కేటాయింపు
» ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాటు చేయాలని ఆదేశం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఇప్పటి వరకు పట్టణ ప్రాంతాలతో పాటు మేజర్ గ్రామ పంచాయతీల్లోనే అందుబాటులో ఉన్న 'మీసేవ' కేంద్రాలు ఇక మారుమూల పల్లె ప్రాంతాల్లోకి కూడా అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో కూడా మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ పక్రియను మొదలుపెట్టిన ప్రభుత్వం దశల వారీగా వీటిని మరింత విస్తరించాలని భావిస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసే మీసేవ కేంద్రాలను పూర్తిగా మహిళా సంఘాలకే కేటాయించింది. మహిళా శక్తి పేరుతో అర్హులైన సభ్యులకు వీటిని మంజూరు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 82 మీసేవ కేంద్రాలను మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 46 ఏర్పాటు కానుండగా వికారాబాద్ జిల్లాలో 20, మేడ్చల్ జిల్లాలో 16 కేంద్రాలను మంజూరు చేశారు. మీసేవ కేంద్రం ద్వారా దాదాపు 40 రకాల ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉంటాయి. ఆధార్, ధరణి, స్థానికత, ఆదాయ, కుల, జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు ఆర్టీసీ, రైల్వే తిరుపతి దర్శనం టిక్కెట్ల రిజర్వేషన్లు వంటి సేవలను ప్రజలు తమ గ్రామం నుంచే పొందే అవకాశం ఉంది. కొత్తగా ఏర్పాటు చేసే మీసేవ కేంద్రాలు ఆగస్టు 15నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావాలని ప్రభుత్వం ఆదేశించింది. జూలై 20వ తేదీనుంచి ఈ కేంద్రాలను ప్రారంభించాలని సూచించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది మంది ప్రజలకు ప్రభుత్వ సేవలు తమ ముంగిటే అందనున్నాయి. ఈ ప్రక్రియ విజయవంతమైతే డిమాండ్‌కు అనుగుణంగా మరికొన్ని గ్రామాల్లో కూడా మీసేవ కేంద్రాలను విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వ భవనాల్లో కేంద్రాల ఏర్పాటు

కొత్తగా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న మీసేవ కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రభుత్వ భవనాల్లోనే ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. గ్రామ పంచాయతీలు. మహిళా సంఘాల భవనాలు, కమ్యూనిటీ భవనాలు, యువజన సంఘాల భవనాల్లో మాత్రమే ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలని స్పష్టంగా పేర్కొంది.

గ్రామాల్లో ఏర్పాటుకానున్న మీసేవ కేంద్రాలు (జిల్లాల వారీగా)

జిల్లా	కేంద్రాలు
రంగారెడ్డి	46
వికారాబాద్	20
మేడ్చల్	16



మీసేవ కేంద్రాల ఏర్పాటుకు ఆయా జిల్లాల గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) అధికారులు సన్నాహాలు మొదలు పెట్టారు. ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యతలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులకే అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అర్హులైన వారిని ఎంపికచేసే ప్రక్రియ మొదలు పెట్టారు. మీ సేవ కేంద్రాలు మంజూరైన గ్రామాల్లో గ్రామైక్య సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మీసేవ కేంద్రాల నిర్వహణపై

ఎంపిక ఇలా...

ప్రాథమికంగా అవగాహన కల్పిస్తున్నారు. ఆయా సంఘాల నెలవారి పొదుపుతో పాటు వాటి ప్రగతి, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీల ద్వారా తీసుకున్న రుణాల వివరాలను సేకరిస్తున్నారు. అలాగే రుణాల రికవరీ ఎలా ఉంది? అనే అంశాలను పరిశీలించి వీటి ఆధారంగా సంఘంలోని సభ్యులను ఎంపిక చేస్తున్నారు. ఇంటర్ అంతకంటే ఎక్కువ చదువుకున్న వారే ఈ కేంద్రాల నిర్వహణకు అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. గ్రామైక్య సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి మీసేవ కేంద్రం నిర్వహణకు ముందుకు వచ్చే మహిళల జాబితాను తీసుకుని వీరిలో ఒకరిని ఎంపిక చేసే బాధ్యత సంఘాలకే అప్పగిస్తున్నారు. ఎక్కువ మందికి సమాన అర్హతలు ఉంటే ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.

రూ.2.50లక్షల రుణ సహాయం

మీ సేవ కేంద్రాలు మంజూరైన వారికి వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వం రుణసహాయం అందచేయాలని నిర్ణయించింది. మీ సేవ ఏర్పాటు చేసే సభ్యురాలికి గ్రామైక్య సంఘం సిఫారసుతో స్త్రీనిధి ద్వారా రూ.2.50లక్షల వరకు రుణం మంజూరు చేస్తారు. ఈ రుణంతో మీసేవ కేంద్రం ఏర్పాటుకు కావాల్సిన కంప్యూటర్, ప్రింటర్, కెమెరా, ఇంటర్నెట్, జీపీఎస్, బయోమెట్రిక్ పరికరాలు, టేబుళ్లు వంటివి సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం ద్వారా అందే దాదాపు 40సేవల ద్వారా మీసేవ నిర్వాహకులకు ఆదాయం సమకూరుతుంది.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

చేవెళ్ల, జూలై 3 : రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే రైతు భరోసాపై క్షేత్రస్థాయిలో రైతుల అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి తెలిపారు. బుధవారం చేవెళ్ల, ఆలూర్ పీఏసీఎస్ సొసైటీల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీంతోపాటు రైతు భరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సమావేశానికి డీసీఎంఎస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సాగు చేస్తున్న వ్యవసాయ భూములకే ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వాలని సూచించారు. అలాగే 5 నుంచి 10 ఎకరాల వరకు మాత్రమే పథకం వర్తింప జేయాలని మరికొందరు రైతులు గీతారెడ్డిని కోరారు. అనంతరం గీతారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందించనున్న రైతు భరోసాపై క్షేత్రస్థాయిలో రైతుల అభిప్రాయం సేకరణ కార్యక్రమం అన్ని పీఏసీఎస్‌లలో తీసుకొని, రైతుల సూచనలు, సలహాలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. చాలామంది రైతులు రైతు భరోసా పథకంతో పాటు అన్ని రకాల సబ్సిడీలను అందించాలని కోరుతున్నారని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలా చేయూతనిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను రైతులు తప్పని సరిగా పాటించాలని వ్యవసాయ అధికారి గీతారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పీఏసీఎస్ ఛైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు వసంతం, రాములు, ఏడీఏ రమాదేవి, ఏవో తులసి, ఏఈవోలు వరుణ్, రమేశ్, రాజేశ్వర్‌రెడ్డి, సొసైటీ సీఈవోలు వెంకటయ్య, ఈశ్వరప్ప, డైరెక్టర్లు, దామోదర్‌రెడ్డి, వెంకటేశ్, మధుసూదన్‌రెడ్డి, శ్యామలయ్య, నర్సింలు, వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గీతారెడ్డి

వికలాంగుల సమస్యలను పరిష్కరించాలి

● కలెక్టరేట్ వద్ద ఎన్పీఆర్డీ ధర్నా



మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వికలాంగులు

మేడ్చల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ రూ.300తో ఎలా బతుకుతారని, దానిని రూ.3వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రూ.4వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నదని పెన్షన్ పెంపు కోసం 44,49,787 మంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారన్నారు. కొత్తగా మరో 24,84,000 మందికి ఇప్పటికీ రాలేదన్నారు. 2015 కంటే ముందు సదరన్ సర్టిఫికెట్ పొందిన వారికి ఆన్‌లైన్‌లో ప్రింట్ తీసుకునే అవకాశం లేదని, 2015 ముందు సర్టిఫికెట్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం డీఆర్వో హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, లక్ష్మీపతి, సహాయ కార్యదర్శి మల్లేష్, విజయలక్ష్మి, రమేష్, నవ్యా, భాను పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్

వికారాబాద్, జూలై 3 : మత్తు పదార్థాల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని, గంజాయి పండించే వారికి ప్రభుత్వ పథకాలు వర్తించవని, అన్ని శాఖల కృషితోనే మత్తు పదార్థాలను అరికట్టడం సాధ్యం అని జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఎక్సైజ్, విద్య, సంక్షేమ, రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ తదితర శాఖల అధికారులతో మత్తు పదార్థాల నిర్మూలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు సమన్వయంతో పని చేస్తూ అన్ని విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాలు, వాటి వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువకుల్లో అవగాహన కల్పించాలన్నారు. యాంటీ డ్రగ్ కమిటీల్లో పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను భాగస్వామ్యంలో ఐదుగురికి తక్కువ కాకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల హాస్టళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ గంజాయి వినియోగదారులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని తెలిపారు. డబ్బు కోసం ఎవరైనా రైతులు గంజాయి పండిస్తే ప్రభుత్వ రాయితీల రద్దుతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. రైలు, రోడ్డు మార్గాల్లో గంజాయిని తరలిస్తున్నట్టు తెలుస్తోందని, గంజాయి రవాణాను అడ్డుకునేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ జీవరాజ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

మేడ్చల్ టౌన్, జూలై 3: తమ పదవీకాలం ముగియడంతో మేడ్చల్ మండల పరిషత్ సభ్యులు బుధవారం బీఆర్ఎస్ ఎంపీటీసీలు, పలువురు నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. మండల పరిషత్ పాలకవర్గానికి కార్యాలయంలో వీడ్కోల సభను నిర్వహించి సన్మానించారు. అనంతరం బీఆర్ఎస్ ఎంపీటీసీలు సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్‌లో ఉంటున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దకు వెళ్లి కలిశారు. కార్యక్రమంలో ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయనంద్‌యాదవ్, నాయకులు భాస్కర్, రాజమల్లారెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌తో మేడ్చల్ మండల బీఆర్ఎస్ నాయకులు

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

తాండూరు రూరల్, జూలై 3 : మండలంలోని అంతారం తండా పాఠశాలలో అంకిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. బుధవారం ప్రధానోపాధ్యాయుడు ఎస్.నర్సింహులు, పాఠశాల చైర్‌పర్సన్ సతాబాయి అధ్యక్షతన ఈ బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి కృషిచేస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ దాసు, మాజీ ఉపసర్పంచ్ రాంచందర్, భూకైలాస్ వ్యవస్థాపకులు వాసుపవార్‌నాయక్, ఉపాధ్యాయుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో పోస్టులు భర్తీ చేయాలని ఇంటర్ బోర్డు అధికారికి వినతి



అధికారి జయప్రదతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దౌల్తాబాద్, జూలై 3: దౌల్తాబాద్‌లోని జూనియర్ కళాశాల భవన నిర్మాణం, పోస్టుల భర్తీకి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్, మాజీ జడ్పీటీసీ జంగం వీరన్న, కుర్మని కృష్ణలు బుధవారం హైదరాబాద్‌లో ఇంటర్ బోర్డు రీజినల్ జాయింట్ డైరెక్టర్ అధికారి జయప్రదను కలిశారు. వారు మాట్లాడుతూ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించామని తెలిపారు. నిర్మాణానికి బడ్జెట్ ఫైల్‌ను ఫైనాన్స్ శాఖకు పంపించినట్లు ఆమె తెలిపారు. కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బంది కోసం పోస్టులు మంజూర్ చేయాలని కోరగా ప్రిన్సిపాల్, అధ్యాపక పోస్టులు 12, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, సీనియర్ అసిస్టెంట్, టైపిస్టు, డేటా ఎంట్రీ ఆపరేటర్, రికార్డు అసిస్టెంట్, ఆఫీసు సబార్డినేటర్, నైట్ వాచ్‌మన్ పోస్టులను మంజూరు చేశారు. ప్రభుత్వం నియామకాలు చేపట్టే వరకు వరకు పది మంది అధ్యాపకులను, గెస్ట్ ఫ్యాకల్టీగా, ముగ్గురు బోధనేతర సిబ్బందిని నియమిస్తామన్నారు. వారం రోజుల్లో బడ్జెట్ విడుదలవుతుందని, భవనం నిర్మిస్తామని ఆమె చెప్పారని నాయకులన్నారు.

వినియోగంలోకి యాచారం బస్టాండ్

● వాహనాల పార్కింగ్, దుకాణాలకు టెండర్.. రూ.10వేల మేర ఆదాయం
● హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు, ప్రయాణికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



యాచారం మండల కేంద్రంలోని బస్టాండ్

యాచారం, జూలై 3 : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ వినియోగంలోకి వచ్చింది. దాంతో ఆర్టీసీ సంస్థకు నెలకు రూ.10వేల మేర ఆదాయం రానుంది. కాగా, బస్టాండ్ ఏళ్ల తరబడిగా వృథా వినియోగంలోకి తేరేం.. అనే శీర్షికన నాలుగు నెలల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ, పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. ఆర్టీసీ అధికారులు తక్షణమే బస్టాండ్‌ను శుభ్రం చేయించి నాలుగు నెలలుగా బస్సులన్నింటినీ బస్టాండ్‌లోకి మళ్లించి నిలుపుతున్నారు. బస్టాండ్ ఆవరణలో మిషన్ భగీరథ నీటిని నల్లాల ద్వారా అందిస్తున్నారు. మూత్రశాల, మరుగుదొడ్డి వినియోగంలోకి తేవడంతో ఓ కుటుంబానికి ఉపాధి దొరికింది. ప్రస్తుతం దేవరకొండ, ఇబ్రహీంపట్నం డిపోల బస్సులు ఇక్కడ నిలుపుతున్నారు. ప్రత్యేకంగా కంట్రోలర్‌ను నియమించారు. బస్టాండ్ ఆవరణలో వివిధ గ్రామాలకు చెందిన ఉద్యోగులు, రైతులు తమ బైక్‌లు పార్క్ చేస్తున్నారు. గమనించిన ఉన్నతాధికారులు బైక్‌లు, కార్ల రక్షణ చూడడం కోసం టెండర్ పిలిచారు. రెండు దుకాణాలను టెండర్ వేశారు. వాటి ద్వారా ఆర్టీసీకి నెలకు కనీసం రూ.10వేల ఆదాయం రానుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన లారీలు బస్టాండ్‌లో నిలుపుకుంటున్నారు. కాగా, కార్లు, లారీలు, ఇతర భారీ వాహనాలు, బైక్‌లను చూడడానికి టెండర్ పిలిచారు. వాటి ద్వారా సంస్థకు భారీగా ఆదాయం రానుంది. బస్టాండ్ ఎదుట మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు కొబ్బరిబొండాల విక్రయం. టీషాపులు తదితర చిరుతిళ్ల విక్రయాలు చేపడుతున్నారు. ఈమేరకు స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా బస్టాండ్‌లో సీసీ రోడ్లు వేసి ఆదుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రామాల్లో ఫాగింగ్ చేయించిన ఎంపీడీవో

యాచారం : మండలంలోని పలు గ్రామాల్లో మురుగు కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిన వైనంపై ఈ నెల 1న 'ఆంధ్రజ్యోతి'లో 'డ్రెయిన్ల నిర్వహణ మృగ్యం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో నరేందర్ రెడ్డి స్పందించారు. గత రెండు రోజులుగా గ్రామాల్లో సాయంత్రం వేళ ఫాగింగ్ చేయిస్తున్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మురుగు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రతీ గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని కార్యదర్శులకు సూచించారు.

కాకునూర్ చౌరస్తాలో మరమ్మతులు

కేశంపేట : మండల కేంద్రంలోని కాకునూర్ చౌరస్తాలో వర్షపు నీరు చెరువును తలిపిస్తోందనే అంశాన్ని మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'చెరువును తలపిస్తున్న కాకునూర్ చౌరస్తా' శీర్షికన ప్రచురితమైన కథనానికి మండల ఇన్‌చార్జి ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి స్పందించారు. ఈమేరకు పంచాయతీ కార్యదర్శి విద్యావతిదేవితో మరమ్మతులు చేయించాలని సూచించారు. నీటి గుంతల్లో మట్టిని పోయించి చదును చేయించారు. దాంతో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంది. ఈ సందర్భంగా అధికారులకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



కేశంపేట : కాకునూర్ చౌరస్తాలో మట్టి పోయించి చదును చేయించిన అధికారులు

'మాటిచ్చా.. సరస్వతి గుడిని నిర్మించా'

» 'ఆంధ్రజ్యోతి'తో సినీ గేయ రచయిత చంద్రబోస్

» ఆయన స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్ గ్రంథాలయం'


ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల, జూలై 3: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ తన గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో సొంత నిధులతో ఆస్కార్ పేరిట ఓ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన చంద్రబోస్.. 'గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం సరస్వతి గుడిని నిర్మించా. చాలా సంతోషంగా ఉంది' అని ఆనందం వ్యక్తం చేశారు. చల్లగరిగలోని తమ ఇంటి పక్కన ఉన్న గ్రంథాలయంలో ఎన్నో సాహిత్య పుస్తకాలు చదివానని, వాటి వల్లే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా చెప్పారు. ఆర్ఆర్ఆర్ సినిమాకు తాను రాసిన నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో బాల్య మిత్రులు, గ్రామ ప్రజలు తనని సన్మానించారని చెప్పారు. ఆ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాటను ఈ రోజున నిలబెట్టుకున్నానని వివరించారు. అందరి సహకారంతో రూ. 36లక్షల వ్యయంతో ఎనిమిది నెలల్లో భవనాన్ని సిద్ధం చేసి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశామని చెప్పారు. కాగా, రచయిత చంద్రబోస్ తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు.

ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్నర సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

» టార్చ్‌లైట్ల వెలుగులో శస్త్రచికిత్సలు

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

» సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ

» కనీస చర్యలూ తీసుకోని వైనం

» ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్క్రీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒక వైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ఠ పర్యవేక్షణ లేకపోవడం తో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.

కుటుంబాన్ని మింగేసిన మద్యం రాకాసి

» మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక..

» ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

» చికిత్స పొందుతూ తల్లీ, ఓ కూతురు మృతి

» మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమం

» కుమరం భీం జిల్లాలో ఘటన


అనిత, రమ్య(ఫైల్)

కాగజ్‌నగర్, జూలై 3: ఐదుగురు ఆడపిల్లల తండ్రి అయిన ఓ వ్యక్తి బాధ్యతలు మరచి మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది అతని భార్యాబిడ్డలు ఆత్మహత్యకు యత్నించారు. భార్య, ఓ కుమార్తె మరణించగా మరో ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. ఇలా కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడ గ్రామానికి చెందిన ఓ కుటుంబాన్ని మద్యం మింగేసింది. వివరాలిలా ఉన్నాయి. గజ్జిగూడకు చెందిన ప్రతాప్‌కు భార్య అనిత(55), ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురికి వివాహమవ్వగా లక్ష్మి(21), రవళి(18), రమ్య(16), ఐశ్వర్య(14) ఇంటి వద్దే ఉంటున్నారు. మద్యానికి బానిసైన ప్రతాప్ తాగిన మైకంలో గ్రామస్థులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని అమ్మేశాడు. మిగిలిన కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ అనిత కుటుంబాన్ని పోషించేది. ఈ క్రమంలో 15 రోజుల క్రితం పొలం వద్ద జరిగిన గొడవలో భాగంగా ప్రతాప్ ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. దీంతో హత్యాయత్నం కేసులో ప్రతాప్ జైలుకెళ్లాడు. అయితే, గ్రామ ప్రజల సాయంతో ప్రతాప్‌కు బెయిల్ ఇప్పించిన అనిత భర్తను జైలు నుంచి బయటకు తీసుకొచ్చింది. ఆ తర్వాత కూడా ప్రతాప్ తీరుమారకపోవడంతో మద్యం మానేయాలంటూ అనిత సోమవారం గొడవపడింది. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రతాప్ భార్య అనితపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అనిత.. కుమార్తెలు రమ్య, లక్ష్మీ, ఐశ్వర్య, రవళితో కలిసి పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. రవళి మినహా తల్లీ కూతుళ్లు అందరూ పురుగు మందు తాగేశారు. రవళి కేకలు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కల పొలాల్లోని వారు అనిత, ఆమె కుమార్తెలను ఆస్పత్రికి తరలించారు. అయితే, రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత, రమ్య బుధవారం మృతి చెందారు. లక్ష్మీ, ఐశ్వర్య పరిస్థితి విషమంగా ఉంది. మరోపక్క, ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.


సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

» చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం

» 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! భాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటిదాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

డీఈవోపై చర్యలు తీసుకోవాలి

» కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన టీఎస్‌యూటీఎఫ్ నేతలు

రంగారెడ్డి అర్బన్, జూలై 3 : పదోన్నతులు, బదిలీలలో అక్రమాలకు పాల్పడుతున్న డీఈవో సుశీందర్‌రావుపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ శశాంకకు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న బదిలీలు, పదోన్నతులలో నిబంధనలను పాటించకుండా డీఈవో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, దీంతో స్థానిక జిల్లా ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డీఈవో చేసిన కార్యక్రమాల గురించి వివరించారు. తెలుగు పదోన్నతుల జాబితాలో(సీరియల్ నెంబర్ 19 వి. జానకిరాం ఎంప్లాయ్ ఐడీ నెంబర్ 1917213)నల్లగొండ జిల్లా నుంచి అంతర్ జిల్లా బదిలీల్లో వచ్చారని తెలిపారు. నల్లగొండ నుంచి వచ్చిన ఉపాధ్యాయుడు ఈ జిల్లాకు వచ్చినప్పటి నుంచి సర్వీసును లెక్కించాలి కానీ.. నల్లగొండలో పనిచేసిన సర్వీసును లెక్కించి పదోన్నతి కల్పిస్తున్నారని ఆరోపించారు. ఎల్. ఉమారాణి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి అంతర్ జిల్లా బదిలీలో వచ్చారని, ఆమె పేరు కూడా పదోన్నతుల జాబితాలో పొందుపర్చినట్లు చెప్పారు. (సీరియల్ నెంబర్ 256, ఎంప్లాయ్ ఐడీ 1729692). స్కూల్ అసిస్టెంట్ బదిలీల్లో ఆర్డర్‌ను జిల్లా వ్యాప్తంగా కలిపి ఇవ్వకుండా మండలాల వారీగా ఇవ్వడంతో ఎవరు ఏ ప్రాధాన్యతా క్రమంలో బదిలీలు కోరుకున్నారో తెలియకుండా పోయిందన్నారు. దీంతో స్పౌస్ కేటగిరీలో తప్పులు చేసిన వారి వివరాలు తెలియకుండా పోయినట్లు చెప్పారు. పదోన్నతులు కల్పించే సందర్భంలో ఖాళీలన్నింటినీ చూపించకుండానే కొన్ని పోస్టులను బ్లాక్‌లో పెట్టడం వల్ల పదోన్నతులు పొందుతున్న ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పదోన్నతుల జాబితా బయటపెట్టకపోవడం.. పెట్టినా తప్పులతో కూడిన జాబితాను ఇస్తున్నారని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు. కె. గోపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటప్ప, కార్యదర్శి ఈ. గాలయ్య, వైస్ ప్రెసిడెంట్స్ ఎన్. కల్పన, రాములయ్య, కోశాధికారి జగన్నాథ్ శర్మ ఉన్నారు.

రైతులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం చర్యలు

ఘట్‌కేసర్, జూలై 3: రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ శివారెడ్డిగూడలోని బందన్ ఫంక్షన్ హాల్‌లో సహకార సంఘం ప్రత్యేక సమావేశం జరిగింది. సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుధీర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రైతుబంధు, కౌలు రైతులకు చేయూతనిచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. దీనిపై విధివిధానాలను రూపొందించే పనిలో ప్రభుత్వం తలమునకలై ఉందన్నారు. రైతులకు మేలు చేయడానికి కృషిచేస్తోందన్నారు. ఎన్నికలతో కొంత జాప్యం జరిగినా ఎన్నికల హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. అంతకు ముందు రైతులు రైతుబంధుపై తమ అభిప్రాయాలను తెలిపారు. వైస్‌చైర్మన్ అనంతరెడ్డి, ఎండీ రాహుల్‌రాజ్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దుదాం

» స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

బంట్వారం (కోట్ పల్లి) జూలై 3: కోటపల్లి వ్యవసాయ మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అధ్యక్షతన కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డిలు హాజరయ్యారు. కోటపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గడ్డకింది అంజయ్య, వైస్ చైర్మన్ గా నారాయణ రెడ్డితో పాటు పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. వచ్చే ఆగస్టు 15 లోపు రైతు రుణ మాఫీ చేసేందుకు ప్రభుత్వం అన్ని సిద్ధం చేసిందన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావనతో సీఎం రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రభుత్వం భరోసా ఇస్తుందన్నారు. అనంతరం కోటపల్లి సమీపంలోని డీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్పీకర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ మహేష్ గౌడ్, రత్నరెడ్డి, కిషన్‌నాయక్, రామచంద్రారెడ్డి మహేశ్వర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, బందెయ్య, సతీష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలి

పరిగి, జూలై 3: డెంగ్యూ, మలేరియా వ్యాధుల నిర్మూలనపై ప్రజలు చైతన్యవంతులు కావాలని పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్ రవీంద్ర అన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం నాల్గో వార్డు టీచర్స్‌కాలనీలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమ లార్వాలను నిర్మూలించే టెన్నిఫాస్ అనే మందును నిల్వ ఉన్న ప్రాంతాల్లో పిచికారి చేయిస్తామని తెలిపారు. దోమలతో మలేరియా, డెంగ్యూ వ్యాధులొచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ రాఘవేందర్ పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధుల నిర్మూలనపై పరిగిలో ర్యాలీ


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి

అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు

మేడ్చల్ టౌన్, జూలై 3: మున్సిపల్ పరిధి అన్ని వార్డులు, కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించామని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం 17వ వార్డులో సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ అర్చనసందీప్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ... మున్సిపల్‌లోని అన్ని కాలనీల్లో ప్రజావసరాలకు అనుగుణంగా రోడ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పట్టణాన్ని అభివృద్ధి పర్చేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున వర్షం నీరు నిలిచి విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సందీప్‌గౌడ్, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ల ఆధునికీకరణతో మెరుగైన సేవలు

» దక్షిణ మధ్య రైల్వే రీజినల్ మేనేజర్ బర్తీష్‌కుమార్ జైన్


రైల్వే స్టేషన్ పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న రైల్వే అధికారి

జహీరాబాద్, జూలై 3: 'అమృత్ భారత్'లో భాగంగా రైల్వేస్టేషన్‌ల ఆధునికీకరణతో ప్రయాణికులకు మరింత ప్రయోజనం చేకూరనుందని దక్షిణమధ్య రైల్వే డీఆర్ఎం బర్తీష్‌కుమార్‌జైన్ అన్నారు. బుధవారం ఆయన కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని పర్లీ, బీదర్, జహీరాబాద్, వికారాబాద్, ఖానాపూర్ రైల్వేస్టేషన్లను పరిశీలించారు. జహీరాబాద్‌లో కొనసాగుతున్న రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. జహీరాబాద్, వికారాబాద్, తాండూర్ రైల్వేస్టేషన్లలో అమృత్ భారత్ పథకంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆయా రైల్వే స్టేషన్లలో కొనసాగుతున్న పనుల తీరుపై సంతృప్తి వ్యకతం చేశారు. పనులను వేగవంతం చేయాలని రైల్వే అధికారులను ఆదేశించారు. తాండూర్-జహీరాబాద్ మధ్య నూతన రైల్వేలైన్ల సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. జహీరాబాద్-బీదర్-ముంబయ్ తదితర ప్రాంతాలకు కొత్త రైళ్లను నడిపించేందుకు కృషిచేస్తామన్నారు. ఆర్ఎంలు సుబ్రహ్మణ్యం, గోపాల్, రైల్వేసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా తాండూరు-జహీరాబాద్ రైల్వే లైన్ సర్వే


పెద్దేముల్, జూలై 3 : తాండూరు నుంచి జహీరాబాద్ మీదుగా రైల్వే లైన్ గురించి సర్వే పనులు చురుకుగా సాగుతున్నాయి. పెద్దేముల్ మండలం రుద్రారం, నాగుపల్లి గ్రామాల శివారు ప్రాంతాల్లో మూన్నాలుగు రోజులుగా సర్వే జరుగుతున్నట్లు తెలిసింది. డ్రోన్‌తో సర్వే చేస్తుండగా రైతులు వారిని ప్రశ్నించారు. బుల్లెట్ ట్రైన్ లైన్ వేసేందుకు ప్రభుత్వ ప్రతిపాదన ఉందని, అందుకే తాము సర్వే చేస్తున్నామని చెప్పారు. దూరభారం తగ్గించే ప్రయత్నంలో తాండూరు-జహీరాబాద్ లైన్ కోసం సర్వే చేస్తున్నామని సర్వే సిబ్బంది రైతులకు తెలిపారు.


ఇబ్రహీంపట్నంలోని నల్లకంచెలో మొక్కలు నాటేందుకు ఉపాధి కూలీలు తీస్తున్న గుంతలను పరిశీలిస్తున్న శ్రీలత

ప్రతీ పంచాయతీలో ఆరువేల మొక్కలు నాటుతాం

» జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత

ఇబ్రహీంపట్నం, జూలై 3: వన మహోత్సవం కింద ప్రతీ పంచాయతీలో ఆరువేల మొక్కల చొప్పున మండలంలో 84,000 మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత చెప్పారు. బుధవారం ఇబ్రహీంపట్నం సమీపంలోని నల్లకంచె అటవీ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు తీస్తున్న గుంతలను ఆమె పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం గుంతలు పూర్తి చేయాలని రోజుకు రూ.300 కూలి గిట్టుబాటయ్యేట్లు పని చేయాలని కూలీలకు సూచించారు. ఇంటి పెరట్లో నాటుకునేందుకు పూల మొక్కలు, పండ్ల మొక్కలు పంపిణీ చేయనున్నట్లు ఆమె చెప్పారు. పొలాల గట్లపై మొక్కలు నాటుకునేందుకు రైతులకు తగు సలహాలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో సుభాషిణి, ఏపీడీ సక్రియా నాయక్, ఏపీవో తిరుపతాచారి, ఈసీ రవికుమార్, సాంకేతిక సహాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


చిత్తాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

అధిక సాంద్రత పద్ధతితో సాగు లాభదాయకం

» వ్యవసాయ శాస్త్రవేత్త చంద్రకాంత్

» మెట్టసాగుపై అన్నదాతలకు అవగాహన

మంచాల, జూలై 3 : అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు లాభదాయకమని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ చంద్రకాంత్ అన్నారు. అధిక సాంద్రత పద్ధతి సాగుపై శిక్షణనిచ్చేందుకు ఆరుట్ల, తాళ్లపల్లిగూడ, చిత్తాపూర్‌లకు చెందిన 30మంది రైతులను ఎంపిక చేశారు. వీరికి చిత్తాపూర్‌లో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం, మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రకాంత్, విజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ సాలుకు మూడు అడుగుల దూరం, మొక్కకు అర అడుగు దూరం ఎడంతో ఎకరాకు 20వేల పత్తి మొక్కల దాకా విత్తవచ్చని చెప్పారు. దీంతో 5 నెలల్లోనే పంట చేతికి వస్తుందన్నారు. అంతేగాకుండా ఒకే కోతలో ఏకకాలంలో పత్తి పంట మొత్తం కాపునకు వస్తుందని తెలిపారు. దీంతో కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. వానాకాలం, యాసంగి రెండు కాలాల్లో ఈ పద్ధతి ద్వారా పంట సాగు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీకృష్ణ, డాక్టర్ సుధీర్, దిలీప్, డాక్టర్ చౌహాన్, ఏఈవో సాయిశ్రీ, ఈవోఆర్డీ మధుసూదనాచారి, వాటర్ సంస్థ ప్రతినిధి మూల కృష్ణ, మాజీ సర్పంచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చివరి సమావేశాలు.. సన్మానాలు

- ముగిసిన 'మండల పరిషత్' పదవీ కాలం
- పాలకవర్గ సభ్యులకు వీడ్కోలు సన్మానాలు



ఇబ్రహీంపట్నం : సన్మానం పొందిన ఎంపీటీసీ సభ్యులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 3: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొనసాగుతున్న ప్రజాస్వామ్య పాలనలో వచ్చే ప్రాదేశిక సభ్యులకు సముచిత స్థానం లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం పదవీ కాలం ముగిసిన ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీటీసీల ఆవేదనను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో స్థానిక ప్రజా ప్రతినిధులకు గౌరవం దక్కలేదని, అధికారం సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలకే పరిమితమైందన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యను రాష్ట్ర సీఎం దృష్టికి తీసుకువెళ్లి, ఎంపీటీసీలకు విధులు, నిధులు వచ్చే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఎంపీపీ ఖాజా ఇద్రీష్ అహ్మద్, జడ్పీటీసీ వెంకట్‌రాం



షాబాద్ : ఎంపీపీ ప్రశాంతిమహేందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న చాంద్‌పాషా

రెడ్డి, వైస్ ఎంపీపీ మౌనిక, ఎంపీడీవో బన్సీలాల్, ఎంఈవో శంకర్ రాథోడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యులున్నారు. కాగా, పవర్ లేని ఎంపీటీసీ పదవులను ప్రభుత్వం రద్దు చేయాలని ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు వాడ్యాల లావణ్య కోరారు. ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించిన ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల వీడ్కోలు సమావేశంలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఎన్నికల్లో గెలుపొందుతున్న ఎంపీటీసీలకు ప్రభుత్వం నిధులు, విధులు ఇవ్వకపోవడంతో గ్రామాల్లో ఏమాత్రం విలువ లేకుండా పోతున్నదని తెలిపారు. గ్రామ పంచాయతీలో కనీసం కుర్చీ కూడ వేయడం లేదని, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు పిలువడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాలలో ఏ ఒక్క పనిచేయకుండా ఉత్సవ విగ్రహాంలా ఉండిపోయామన్నారు. నిరుద్యోగ సమస్యను తీర్చడానికి పెడుతున్న ఎంపీటీసీల వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిధులు, విధులు ఇస్తేనే ఎంపీటీసీ ఎన్నికలను నిర్వహించాలని లావణ్య కోరారు.

కొత్తూర్ : పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తుండడంతో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంతో పాటు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే.. జడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలకు జ్ఞాపికలను అందజేసి శాలువలతో ఘనంగా సన్మానించారు. మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శోభ లింగంనాయక్, ఎంపీటీసీలు రవీందర్‌రెడ్డి, కృష్ణయ్య, రాజేందర్‌గౌడ్, ఇందూరి సత్తమ్మ, డాకీ, ప్రసన్న, కోఆప్షన్‌సభ్యుడు విజయ్‌పాల్‌రెడ్డి, అధికారులు, నాయకులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ : బీఆర్ఎస్ పాలనలో ప్రజాప్రతినిధులు ఎన్నో అవమానాలు పొందారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాపాలన లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలకేంద్రంలో ఎంపీపీ ప్రియాంక శివశంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎంపీటీసీలకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని వారిని ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో సుమతి వైస్‌ఎంపీపీ మంజుల, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, రాజునాయక్, మాదవి, కాట్న లతా శ్రీశైలం, ఎంకిర్యాల కళమ్మ, మాజీ సర్పంచులు పాండురంగారెడ్డి, రమేష్ నాయకులున్నారు.

ఇబ్రహీంపట్నం : ప్రజాప్రతినిధిగా నిస్వార్థంతో సేవ చేసిన వారిని ప్రజలు ఎప్పుడూ మరిచిపోరని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్, వైస్ ఎంపీపీ ఎం.వెంకటప్రతాప్‌రెడ్డిలు అన్నారు. ఎంపీటీసీల పదవీకాలం ముగిసిన సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు పాల్గొని ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో వెంకటమ్మ, మండల వ్యవసాయాధికారి వరప్రసాద్ రెడ్డి, ఏఈ ఇంద్రసేనారెడ్డి, ఎంపీవో లక్ష్మతినాయక్, సెర్ప్ ఎంపీఎం రవీందర్, ఉపాధి హామీ పథకం ఏపీవో తిరుపతాచారి తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్ : వీడ్కోలు సన్మానంలో కడ్తాల మండల పరిషత్ పాలకవర్గం

మంచాల : మంచాల మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఇటీవల పదవీ కాలం పూర్తయిన జెడ్పీటీసీ మర్రి నిత్యనిరంజన్‌రెడ్డి, ఎంపీపీ జాటోత్‌నర్మద లచ్చిరాం, తాజీ మాజీ ఎంపీటీసీలతో పాటు బదిలీపై వెళ్లిన ఎంపీడీవో శ్రీనివాస్‌కు ఆత్మీయ వీడ్కోలు పలికారు. వారందరినీ శాలువా, మెమొంటోతో సత్కరించారు. మాజీ ఎంపీటీసీలు చీరాల రమేష్, కావలి శ్రీనివాస్, ఎడమ నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జయానందం, కాట్రోత్ పరంగా, నర్సింగ్ అనిత, పి.సుకన్య, మధుసూదన్‌రెడ్డి, రాందాస్, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అధ్యక్షతన నిర్వహించారు. జడ్పీటీసీ ధశరథ్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, వైస్ ఎంపీపీ ఆనంద్‌లు హాజరయ్యారు. మండల పరిషత్ పాలక వర్గం పదవీకాలం గురువారం ముగియనున్న నేపథ్యంలో చివరి సమావేశం సాదాసీదాగా సాగింది. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు చోటు లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలని.. అప్పుడే ప్రగతి ఆశించిన రీతిలో సాధ్యపడుతుందని ఎంపీటీసీ సభ్యులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బొప్పిడి గోపాల్, లచ్చిరామ్‌నాయక్, ఉమావతి, నిర్మలాదేవి, మంజుల, ప్రియ, పాలకుర్ల రాములు, జహంగీర్‌బాబాలు అభిప్రాయపడ్డారు. పదవులు శాశ్వతం కాదని, చేసిన పనులు చిరస్థాయిగా నిలుస్తాయని కమ్లీమోత్యానాయక్, దశరథ్ నాయక్‌లు అన్నారు. ఎంపీడీవో సుజాత, సీఐ శివప్రసాద్, తహసీల్దార్ ముంతాజ్, ఏఈలు పరమేశ్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు. కాగా, కడ్తాల మండల పరిషత్ పాలక వర్గం పదవీ కాలం ముగింపు నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సన్మాన వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, మండల వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సత్కరించి అభినందించారు. అలాగే ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్, వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్‌ల ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు పాల్గొన్నారు.



మంచాల : సన్మానం పొందిన మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీలు

షాబాద్ : ఐదేళ్లుగా మండలాన్ని అందరి సహకారంతో పార్టీలకతీతంగా అభివృద్ధి చేశామని ఎంపీపీ ప్రశాంతిమహేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశామన్నారు. మరోసారి ప్రజలు అవకాశమిస్తే మరింత సేవ చేస్తామన్నారు. చివరి సమావేశం కావడంతో ఎంపీటీసీలను ఎంపీపీ సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ లక్ష్మీ రాజేందర్‌గౌడ్, ఎంపీడీవో అపర్ణ, కోఆప్షన్ మెంబర్ చాంద్‌పాష, డిప్యూటీ తహసీల్దార్ మధు, ఏవో వెంకటేశం, ఎంఈవో శంకర్‌రాథోడ్, తదితరులున్నారు.





షాద్‌నగర్‌అర్బన్/కొత్తూర్/నందిగామ : ఫరూఖ్‌నగర్, కొత్తూర్, నందిగామ ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్, ప్రతాప్‌రెడ్డి

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

షాద్‌నగర్, జూలై 3 : విద్యా శాఖలో భాగమైన సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఈ మేరకు సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం తమకు టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. అలాగే సమగ్ర శిక్ష కేజీబీవీ, యూఆర్ఎస్‌లను విద్యా శాఖలో విలీనం చేసి కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు.

సేవలను విస్మరిస్తే కఠిన చర్యలు

- జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

షాద్‌నగర్ అర్బన్, జూలై 3: వైద్య సేవలను విస్మరించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.వెంకటేశ్వరావు హెచ్చరించారు. షాద్‌నగర్ పట్టణంలోని ఏబీవీ, బుగ్గారెడ్డి ఆసుపత్రులను బుధవారం తనిఖీ చేశారు. ఏబీవీ ఆసుపత్రిలో రికార్డులు, సౌకర్యాలను పరిశీలించి, ప్రత్యేకంగా ప్రసూతి గదిని ఏర్పాటు చేసుకోవాలని, పారిశుధ్యం పాటించాలని, అర్హత మేరకే వైద్యం చేయాలని సూచించారు. అనంతరం బుగ్గారెడ్డి ఆసుపత్రిలోని సౌకర్యాలను, రికార్డులను పరిశీలించి, ఆసుపత్రిలో వైద్యం పొందిన వారినుంచి ప్రతికూల పరిస్థితులు ఎదురుకాకుండా జగ్రత్తగా వైద్యం చేయాలని తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలోని ఇతర ఆసుపత్రులను తనిఖీ చేస్తామని, అర్హతకు మించి వైద్యం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తనిఖీలో ఉప జిల్లా వైద్యాధికారులు డాక్టర్ విజయలక్ష్మీ, డాక్టర్ దామోదర్, జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ కె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్‌లు ఐక్యంగా ఉండాలి

షాద్‌నగర్/చౌదరిగూడ/కొందుర్గు జూలై 3 : మెకానిక్‌లంతా ఐక్యంగా ఉండాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ పిలుపునిచ్చారు. మెకానిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం టూ వీలర్ అసోసియేషన్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని కేక్ కట్ చేశారు. చౌదరిగూడ, కొందుర్గు మండల కేంద్రాల్లో మెకానిక్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు బంటారం సుధాకర్‌గౌడ్‌తో పాటు భాస్కర్, కుమార్, అశోక్‌రెడ్డి, నర్సింహులు, రాజేష్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ : కేక్ కట్ చేస్తున్న పినపాక ప్రభాకర్

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

శంషాబాద్ రూరల్, జూలై 3 : గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని నర్కూడలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జడ్పీటీసీ నీరటి తన్వీరాజు అధ్వర్యంలో నర్కూడలో సీసీ రోడ్ల, గౌడ భవనం ప్రారంభోత్సవం వంటి కార్యక్రమాలు, ఉపాధి హామీ పథకంకింద రూ.15 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం, రూ.30 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్‌భవనం, రూ.76 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులు ప్రారంభించామన్నారు. ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, జడ్పీటీసీ తన్వీరాజు, వైస్‌ఎంపీపీ నీలంనాయక్, మల్కా రం పీఏసీఎస్ చైర్మన్ సతీష్, వెంకటేష్‌గౌడ్, ఎంపీటీసీ గౌతమి, మాజీ సర్పంచ్ ఇస్తారి పాల్గొన్నారు.



నర్కూడలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

సాగు చేసే రైతులందరికీ 'రైతు భరోసా' వర్తింపు

తలకొండపల్లి, జూలై 3: సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా పథకం వర్తింపజేయనున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఈ మేరకు రైతుల అభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టిందన్నారు. వెంకటాపూర్ గేట్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతు భరోసా పథకం అమలుపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ కేశవ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే, రంగారెడ్డి జిల్లా స్పెషలాఫీసర్ నాగ లింగాచారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శారద హాజరయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. వైస్‌ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ కూన రవి, డైరెక్టర్లు శ్రీనివాస్, దేవులానాయక్, రాజవర్ధన్‌రెడ్డి, యాదమ్మ, యాదయ్య, నయీమ్, సీఈవో ప్రతాప్ రెడ్డి, తదితరులున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నారాయణరెడ్డి

సంక్షిప్తంగా..

కొత్తూర్ : మండల కేంద్రంలోని ఓ పాన్ షాపు, కిరాణ దుకాణంపై బుధవారం రాత్రి దాడులు నిర్వహించి గుట్కాలు, పాన్‌మసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు. గురుచరణ్, అమర్‌కు నాల్‌పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆమనగల్లు : ఎంపీ మల్లురవికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీలో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసి బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య, ఆమనగల్లు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు ఆధ్వర్యంలో నాయకులు మల్లురవికి శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలికారు.

ఆమనగల్లు : మండల పరిధిలోని శెట్టిపల్లివేముల చెరువు కట్ట అలుగుపై వంతెన నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు తీర్చాలని స్థానిక మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవీ సత్యం ఎ మ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కోరారు. ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని కలిసి వినతిపత్రమిచ్చారు.

శంషాబాద్ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మికులు సీఐటీయూ జిల్లా సభ్యుడు మల్లేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు గణేశ్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : రైతు భరోసా పథకం అమలుపై పీఏసీఎస్ ఆధ్వర్యంలో నేడు(గురువారం) ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని రైతు వేదికలో గురువారం మధ్యాహ్నం 2గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆమనగల్లు పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్ మాట్లాడారు.

చేవెళ్ల : నేడు విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ, పీడీఎస్, వామపక్ష సంఘాలు, యువజన సంఘాలు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు.

ఆమనగల్లు : నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకలను నిరసిస్తూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నేడు(గురువారం) విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ఎండీ ఫరీద్ తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నీట్ పరీక్ష నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి లక్షలాది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడందని ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో బంద్ విజయవంతంపై నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు.

మొయినాబాద్ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు చక్కగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం రంగరాజన్ సొంత డబ్బులతో సమకూర్చిన పుస్తకాలను పంపిణీ చేశారు. హెచ్ఎం భీమయ్య, ఉపాధ్యాయులు ఆలయ బృందం సభ్యులు పాల్గొన్నారు.

కేశంపేట : దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలను అందిపుచ్చుకోవాలని కేశంపేట మండల ఏపీఎం భగవంతు సూచించారు. దివ్యాంగుల పునరావాస కేంద్రంలో మనోప్రగతి కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగుల మానసిక స్థితిని అంచనా వేశారు. స్పీచ్ థెరఫీ, వస్తువులను గుర్తించడం చేయించారు.

ఆమనగల్లు : కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిక శాఖ మంత్రి వీరేంద్రకుమార్ ఖతీక్‌ను టీడీపీ కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జి, రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి అండేకార్ యాదిలాల్ కలిశారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అరెకటికల సంఘం సమస్యలను మంత్రి వీరేంద్ర కుమార్ కు వివరించినట్లు యాదిలాల్ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలో ఆరెకటికటికలను ఎస్సీ జాబితాలో చేర్చాలని వినతిపత్రం ఇచ్చారు.

మంచాల : నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె బాషయ్య మంచాల మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ మండలాధ్యక్షుడు జంగయ్య, కొండల్ ముదిరాజ్, నూకంరాజు, గడ్డం రాజేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

షాబాద్ : విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్ అన్నారు. ఉబ్బగుంటలో విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన 2పాడిగేదెల రైతు సాయన్న కుటుంబాన్ని సంఘం సభ్యులతో కలిసి కలిశారు.

షాద్‌నగర్‌అర్బన్ : మత్స్యశాఖలో పనిచేస్తున్న అవినీతి అధికారులపై చర్యలు తీసుకుని మత్స్యకారులకు న్యాయం చేయాలని ముదిరాజ్ మహాసభ షాద్‌నగర్ అధ్యక్షుడు ఆంచ రాములు రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంకకు వినతి పత్రాన్ని ఇచ్చారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర మత్స్య శాఖ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి, మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించినట్లు తెలిపారు.

ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణంలో ఎస్సీ పోస్ట్‌మెట్రిక్ కళాశాల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ రామారావును సోషలిస్టు విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ జంతుక శంకర్ కోరారు. జిల్లా కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

ఆదిభట్ల : మున్సిపాలిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి స్వచ్ఛ ఆదిభట్ల కార్యక్రమంలో భాగంగా కమిషనర్ బాలకృష్ణ వివిధ శాఖల అధికారులతో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీ పటేల్ గూడలోని పలు వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రోడ్డు వెంబడి ఉన్న మురికి కాలువలు, చెత్తను శుభ్రం చేయించారు. మంగళపల్లి పటేల్ గూడ ప్రధాన రహదారి పక్కన ఉన్న నాలాను జేసీబీ సహాయంతో శుభ్రం చేయించారు.

కేశంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీజేవైఎం నాయకుడు కుంచుకోట మహేష్ డిమాండ్ చేశారు. బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మండల కేంద్రంలో తహసీల్దార్ మీర్ అజాంఅలీకి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు.

ఇబ్రహీంపట్నం : పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో నిరసన తెలిపి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.7,500 కోట్లకుపైగా నిధులు విడుదల చేయాల్సి ఉందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఎం.సాయినరణ్ అన్నారు.

ఆమనగల్లు : వనమహోత్సవం కార్యక్రమంలో బాగంగా ఆమనగల్లు మండలంలో 1.43 లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు ఎంపీడీవో కుసుమ మాధురి తెలిపారు. లక్ష్యాల పూర్తికి, వనమహోత్సవం విజయవంతానికి ప్రజలంత సహకరించాలని ఆమె కోరారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి, మేడిగడ్డ తండా లలో బుధవారం ఎంపీడీవో కుసుమ మాధురి పర్యటించారు.

తలకొండపల్లి : ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని తహసీల్దార్ రంగారెడ్డి, టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్‌లు పిలుపునిచ్చారు. మండల కార్యాలయంలో వనమహోత్సవం నిర్వహించారు. మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని యువకుడు మృతి

శంకర్‌పల్లి, జూలై 3: గుర్తుతెలియని యువకుడు(27) మృతి చెందిన సంఘటన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్జాగూడ అనుబంధ గ్రామం మియాఖాన్ గడ్డ చౌరస్తా సమీపంలో గుర్తుతెలియని యువకుడు చనిపోయి ఉండగా.. బుధవారం ఉదయం స్థానికులు గమనించారు. మోకిల పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పరిశీలించారు. ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని తెలిపారు. భిక్షాటన చేసే యువకుడు అయి ఉంటాడని, సరైన వేళకు ఆహారం లేక పోవడంతోనే చనిపోయాడని అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు. మృతుడి ఒంటిపై బ్లాక్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నట్లు ఆయన తెలిపారు.

హిమాయత్ సాగర్‌లో మృతదేహం లభ్యం

శంషాబాద్, జూల్ 3 : శంషాబాద్ మున్సిపాలిటీలోని కోత్వాల్‌గూడ బస్తీ శివారులోని హిమాయత్‌సాగర్‌లో బుధవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు. చెరువులో తేలియాడుతున్న శవాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి పంచనామా చేసి ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడు చామన చాయ రంగు కలిగి.. 40 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిస్తే శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

బాలుడిని చితకబాదిన వ్యక్తి అరెస్టు

షాబాద్, జూలై 3 : పది రోజుల క్రితం మండల పరిధిలోని కేసారం గ్రామంలో 7వ తరగతి చదువుతున్న దళిత విద్యార్థి యాదగిరిపై అదే గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి.. జామకాయలు దొంగతనం చేశాడనే నెపంతో బాలుడిని తాడుతో కట్టేసి దాడిచేశాడు. అనంతరం కులం పేరుతో దూషించాడు. బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మధుసూదన్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. విచారణానంతరం బుధవారం మధుసూదన్‌రెడ్డిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపారు.

'పింఛన్' పెంచాలని కలెక్టర్‌కు వినతి

రంగారెడ్డి అర్బన్, జూలై 3 : కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ రూ.300 నుంచి 3,000లకు, రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌ను రూ.6,000లకు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ అధ్యక్షుడు భుజంగరెడ్డి, ప్రధాన కార్యదర్శి జేర్కోని రాజు, కోశాధికారి దేవరంపల్లి రాజశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ శశాంకకు కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు వికలాంగు సమస్యలను కలెక్టర్ దృష్టి తీసుకెళ్లారు. 2011 నుంచి కేంద్ర ప్రభుత్వం వాటా పింఛన్లలో కేవలం 300 రూపాయలు మాత్రమే ఉందని, ధరల పెరుగుదలకు అనుగుణంగా పింఛన్ పెంచాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచి వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి క్యాంటీన్లలో వికలాంగులకు 5 శాతం కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తీవ్ర వైకల్యం కలిగిన వారికి ప్రత్యేక అలవెన్స్ కోసం లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

శంషాబాద్/షాద్‌నగర్ రూరల్, జూలై 3 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని లాడ్జీలను ఆర్జీఐఏ పోలీసులు బుధవారం రాత్రి తనిఖీ చేశారు. లాడ్జీల్లో ఎవరెవరు ఉంటున్నారు? నిర్వాహకులు నిబంధనల ప్రకారం గదుల్లో అద్దెకు ఉండేవారి వివరాలు తెలుసుకుంటున్నారా? లేదా అనే విషయాలను పరిశీలించేందుకు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ బాల్‌రాజ్ మాట్లాడుతూ లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా నిరోధించడానికి తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా షాద్‌నగర్‌లోని పలు చోట్ల పోలీసులు తనిఖీలు నిర్వహించారు. శంషాబాద్ డీసీపీ రాజేష్ ఆదేశాల మేరకు షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్, ముఖ్య కూడలి, ఎలికట్ట చౌరస్తా, షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌తో పాటు పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. కార్లు, బ్యాగులు, ఇతర సామగ్రిని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

ఆమనగల్లు, జూలై 3: గత ప్రభుత్వం హయాంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వ నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించేలా, పారిశుధ్య కార్మికుల వేతనాలు అందించేలా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం పలువురు తాజా మాజీ సర్పంచ్‌లతో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, పారిశుధ్యం పడేకసిందని కేటీఆర్ దృష్టికి తీసుకుపోయినట్లు జీఎల్ఎన్‌రెడ్డి తెలిపారు. రూ.లక్షల్లో అప్పులు చేసి పనులు చేశారని, పెండింగ్ బిల్లుల చెల్లింపు గూర్చి ప్రభుత్వంపై ఎన్నిసార్లు ఒత్తిడి తెచ్చినా స్పందన లేదని పేర్కొన్నారు. ఇటీవల గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈమేరకు కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపు గూర్చి తాజా మాజీ సర్పంచ్‌ల పోరాటానికి తమ మద్దతు ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నట్లు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. మాజీ సర్పంచ్‌లు బొజ్జ రమేశ్‌రెడ్డి, యాదిరెడ్డి, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

మొయినాబాద్ రూరల్, జూలై 3: నియోజకవర్గంలోని గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. మండల పరిధిలోని రెడ్డిపల్లిలోని పలు కాలనీల్లో మండల పరిషత్, గ్రామ పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజ్ మురుగు కాలువల నిర్మాణ పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ కాలే శ్రీకాంత్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు మోర శ్రీనివాస్, ఎంపీడీవో సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి కిషన్ గ్రామస్థులు పాల్గొన్నారు.

జడ్పీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం

కేశంపేట, జూలై 3: పాపిరెడ్డిగూడలో జడ్పీటీసీ విశాలశ్రవణ్ రెడ్డి నిధులతో బుధవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణానికిక రూ. 4.5లక్షలు మంజూరు చేయించినందుకు గాను జడ్పీటీసీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్బి సుందరయ్య, చేవేళ్ల నరసింహులు, మదునాల శివానందు, కుమ్మరి శేఖర్, హన్మంత్ రెడ్డి, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి : ఎంపీటీసీ

కడ్తాల్, జూలై 3: సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీటీసీ ప్రియారమేశ్ అన్నారు. మండలంలోని సాలార్‌పూర్‌లో మండల పరిషత్ నిధులు రూ.5లక్షలతో చేపడుతున్న అంతర్గత మురుగు కాల్వ, రూ.లక్షతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఎంపీటీసీ శంకుస్థాపన చేశారు. మాజీ ఎంపీపీ సువాలిపంతూ, మాజీ ఎంపీటీసీ సాయిలు, నాయకులు బాబా, గోపాల్, రాజు, పాండు, తదితరులున్నారు.

'పంచాయతీ కార్యదర్శిని తొలగించండి'

మొయినాబాద్ రూరల్, జూలై 3: హిమాయత్ నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్య గ్రామంలో పాలనను గాలికొదిలేసి వసూళ్లకు పాల్పడుతున్నారని, ఆమెను వెంటనే విధుల నుంచి తొలగించి మరో అధికారిని నియమించాలని హిమాయత్ నగర్ గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కంజర్ల శేఖర్, షాబాద్ సందీప్, షాబాద్ ప్రవీణ్‌లు ఎంపీడీవో సంధ్యారాణికి బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామ రెవెన్యూ పరిధిలో నిర్మాణాలు జరుగుతుంటే బహిరంగంగానే డబ్బులు తీసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏ పని చేయాలన్నా లంచం లేనిదే చేయడం లేదని తెలిపారు. విధుల నుంచి తొలగించాలని ఎంపీడీవోను కోరారు. పంచాయతీ కార్యదర్శిపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.